రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 3: మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ ఆయిల్ సంస్థ (సీఆర్ఎస్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ సర్వీసెస్ నిధుల ద్వారా మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా రేడియేషన్ లేకుండా రొమ్ము క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్‌ను గుర్తించే అత్యాధునిక స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మెషీన్, తెలంగాణ డయాగ్నస్టిక్స్ మినీహబ్‌ను ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. మహిళల్లో తరచు వచ్చే రొమ్ము క్యాన్సర్‌తో పాటు సర్వైకల్ క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో పరీక్షలు నిర్వహించి గుర్తించవచ్చని అన్నారు. అల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా రొమ్ము క్యాన్సర్‌ని గుర్తించే అత్యాధునిక మిషన్లు అందుబాటులో ఉన్నాయని, మహిళలు స్వచ్ఛందంగా వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ, డాక్టర్ శోభ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సీజీఎం బద్రీ నాథ్, కైలాష్, కార్పొరేటర్ శాంతి, మహిత డైరెక్టర్ రమేష్ శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వేయర్ల శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): భూమి హద్దులు, రాళ్లు, చైన్ సిస్టం తదితర అంశాలపై సర్వేయర్లకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సర్వేధికారి వీ శ్రీరామ్ అన్నారు. మంగళవారం గోషామహల్ స్టేడియంలో.. లైసెన్స్‌డ్ సర్వేయర్స్ శిక్షణ కార్యక్రమంలో యువకులకు భూమి కొలతల పద్ధతులపై వివరించారు. ఈ ప్రోగ్రాంను మే 26న కలెక్టర్ అనుదీప్ ప్రారంభించారని, ట్రైనింగ్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో భూముల కొలతలు ఎలా చేయాలో, భూమి హద్దులు, రాళ్లు ఎలా ఉంటాయో, చైన్ సిస్టం ద్వారా భూమి కొలతలు చేసే విధానం గురించి శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్, సర్వేయర్లు విజయ్ కుమార్, రంగయ్య యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

హైదరాబాద్‌లో టీటీఏ వార్షికోత్సవ వేడుకలు

సుల్తాన్‌బజార్, జూన్ 3: తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో తమ ప్రతిష్టాత్మక కార్యక్రమాల తేదీల వివరాలను అధికారికంగా ప్రకటించింది. టీటీఏ మెగా కన్వెన్షన్ వచ్చే ఏడాది 2026 జూలై 17 నుంచి 19వ తేదీలలో నిర్వహిస్తామని.. కాగా టీటీఏ 10వ వార్షికోత్సవ వేడుకలను డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరుగుతాయని టీటీఏ అధ్యక్షుడు మలిపెద్ది నవీన్ రెడ్డి, వ్యవస్థాపకులు ఫైళ్ల మల్లారెడ్డి, అడ్వైజరీ కౌన్సిల్ చైర్ డా. విజయపాల్ రెడ్డి, కోచైర్ డా.మోహన్‌రెడ్డి డల్లాస్ వేదికగా మంగళవారం జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఈ వేడుకలకు ఎల్ఎన్ రెడ్డి దొంతిరెడ్డి ఈవెంట్ చైర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా టీటీఏ సేవా దినోత్సవాల రోడ్‌మ్యాప్‌ను కోఆర్డినేటర్ విశ్వ కండి బోర్డుకు సమర్పించారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షులు మలిపెద్ది నవీన్ రెడ్డి, అడ్వైజరీ బోర్డుతో పాటు గత అధ్యక్షులు, కార్యనిర్వాహక కమిటీ, స్టాండింగ్ కమిటీ చైర్‌లు మరియు రీజినల్ వైస్ ప్రెసిడెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా జ్యోతిరెడ్డి దూది పాలను కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఎంపిక చేసినట్లు సగర్వంగా ప్రకటించింది. టీటీఏ సాంస్కృతిక ప్రభావానికి దశాబ్దం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, 10వవార్షికోత్సవ వేడుకలను 2026 డిసెంబర్ లో హైదరాబాద్‌లో జరుపుకోవాలని బోర్డుఆఫ్ డైరెక్టర్స్ ఏకగ్రీవంగా తీర్మానించారు. డల్లాస్ సమావేశాన్ని విజయవంతం చేసిన టీటీఏ బృందం ప్రవీణ్ చింత, విశ్వ కండి, నరేష్, వెంకట్ అన్నపరెడ్డి, శేఖర్, సందీప్, మహేష్, మరియు నిశాంక్‌ను అధ్యక్షులు నవీన్ రెడ్డి, బోర్డు సభ్యులు ప్రసంశించారు.

మురుగు కట్టడికి మరమ్మతులు వేగవంతం

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): మలక్‌పేట్ అక్బర్ ప్లాజా వద్ద తలెత్తిన మురుగు సమస్యను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన సీవరేజ్ లైన్ శిథిలమైపోవడంతో అవుట్‌లెట్ లేక, వర్షం కురిసిన సమయాల్లో రహదారిపై మురుగు పొంగుతున్నట్టు గుర్తించారు. కొత్త సివరేజ్ లైన్‌ల వలన తాత్కాలికంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. సమీపంలోని భవనాల నుంచి ఉత్పన్నమయ్యే మురుగును ఎక్కడికక్కడే కాకుండా ఒకే అవుట్‌లెట్ వద్ద అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని సీవరేజ్, వాననీటి కాలువ అనుసంధానం అయ్యే పాయింట్లను గుర్తించి, ఆ ప్రాంతాల్లో రెండు లైన్లను వేరువేరుగా నిర్మించి, సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

హోటల్ యజమానికి జరిమానా...

నల్గొండ చౌరస్తాకు ఆనుకొని ఉన్న భవనంలో హోటల్ యజమాని తన సీవరేజ్ లైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్వర్క్‌కు అనుసంధానం చేసి అందులో ఆహార, వ్యర్థ పదార్థాలను వేస్తూ వస్తున్న కారణంగా, ఆ ప్రాంతంలో మ్యాన్ హోళ్లు నిండిపోయి రహదారులపై మురుగు పారుతోంది. పరిశీలనలో ఇది బయటపడటంతో సీవరేజ్ ఓవర్ ఫ్లోకు కారణమైన హోటల్ యజమానికి రూ.10 వేల జరిమానా విధించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే 10 రోజులలో సిల్ట్ ఛాంబర్ నిర్మించుకోకపోతే జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి హోటల్‌ను సీజ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం నాగేందర్, జీఎం, ఇతర అధికారులు, హైడ్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో సివరేజ్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

డబుల్ కేటాయింపుల్లో పక్షపాతం

అర్హులను కాదని కాంగ్రెస్ కార్యకర్తలకు ఇళ్ల కేటాయింపు!

ఎమ్మెల్యే మల్లారెడ్డి వద్ద ప్రతాపసింగారం వాసుల మొర

మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లిన మల్లారెడ్డి

మేడ్చల్, జూన్ 3(నమస్తే తెలంగాణ): అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించకుండా తమ కార్యకర్తలకే ఇచ్చే విధంగా కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని మేడ్చల్ జిల్లావాసులు ఆరోపించారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతాపసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లను కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించే విధంగా జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసానికి మంగళవారం బాధితులు తరలివచ్చారు. అర్హులైన తమకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు డబుల్ ఇళ్లు అందించేందుకు జాబితాను సిద్ధం చేస్తున్నారని మల్లారెడ్డికి మెరపెట్టుకున్నారు. గతంలో డబుల్‌బెడ్‌రూమ్‌లను కేటాయించేలా తమ పేర్లతో జాబితా సిద్ధం కాగా ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు మరో జాబితాను తయారు చేయడంపై వారు మండిపడుతున్నారు. అర్హులందరికి డబుల్ బెడ్‌రూమ్‌లు అందే వరకు పోరాటం చెస్తామని మాజీ మంత్రి మల్లారెడ్డి బాధితులకు హామీ ఇచ్చారు. తదనంతరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులకు డబుల్‌బెడ్‌రూమ్‌లను కేటాయించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. మల్లారెడ్డితో పాటు ప్రతాపసింగారం మాజీ సర్పంచ్ శివశంకర్, నాయకులు సంజీవరెడ్డి ఉన్నారు.

ప్రతాపసింగారంలో 2వేల ఇళ్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతాపసింగారంలో 2వేల డబుల్‌బెడ్‌రూమ్‌లను నిర్మించారు. అయితే ఇందుకు సంబంధించి ప్రతాపసింగారం గ్రామానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్‌లను అందించేలా నిర్ణయించారు. అయితే తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అర్హులకు కాకుండా తమ కార్యకర్తలకు ఇళ్లు అందించేలా ప్రయత్నాలు చేస్తోందంటూ ఆరోపణలున్నాయి. ఈ అరాచాకాలను అడ్డుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, నాయకులు

సమన్వయంతో పనిచేయాలి

వర్షాకాల సన్నద్ధతపై సీఎం రేవంత్ సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): వర్షాకాల సన్నద్ధతపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనలను అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తిచేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎంవోయూ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి తదితరులు

అంబేద్కర్ వర్సిటీలో హెచ్‌హెచ్‌సీఎం కోర్సు

బంజారాహిల్స్, జూన్ 3: డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ (హెచ్‌హెచ్‌సీఎమ్) కోర్సును అందించడానికి నగరానికి చెందిన మూడు విద్యాసంస్థలతో అంబేద్కర్ వర్సిటీ అవగాహహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి సమక్షంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ విద్యాసంస్థలతో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. కార్పొరేట్ వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్న తరుణంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును అందించడంతో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కోర్సులను అందించేందుకు గతంలో ఉన్న ఒప్పందాన్ని ప్రస్తుతం పునరుద్ధరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.పుష్పా చక్రపాణి, డీన్ ప్రొ.ఆనంద్ పవార్, ప్రొ.కిరణ్మయితో పాటు అపోలో ప్రతినిధి డా.భాస్కర్‌రెడ్డి, కిమ్స్ ప్రతినిధి డా.రాజేంద్ర అన్నే, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతినిధి డా.మనీషా సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కే శ్రీనివాస్ తదితరులు

ఓయూలో ఆది ధ్వని మ్యూజియం

ఆద్యకళ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జయధీర్ తిరుమలరావు

సిటీ బ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఆదిమకాలం నుంచి నేటి దాకా ఆదివాసీ, గిరిజనులతో పాటు గ్రామీణులు వినియోగించిన వాయిద్యాలు, పురాతన వస్తువులను 50 ఏండ్లుగా సేకరించి సంరక్షించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆద్యకళ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జయధీర్ తిరుమలరావు అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆద్యకళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆద్యకళ అభిమానులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయధీర్ మాట్లాడుతూ... ప్రభుత్వ అనుమతితో ఉస్మానియా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ క్వార్టర్స్‌లో ఆది ధ్వని మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీని ఏర్పాటు ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ భాగస్వామ్యంతో జరుగుతున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, పలువురు ప్రొఫెసర్లు, పరిశోధకులు, సంపాదకులు కొండవీటి సత్యవతి, కే శ్రీనివాస్, కే రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరిస్తున్న సర్కార్

ఐఎఫ్‌టీయూ జాతీయ కన్వీనర్ షేక్‌షావలి

జవహర్‌నగర్, జూన్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా అడుగులు వేయలేదని ఐఎఫ్‌టీయూ జాతీయ కన్వీనర్ షేక్‌షావలి విమర్శించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ వేడుకల్లోనూ తెలంగాణ కోసం పోరాడిన అమరుల కుటుంబాలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారన్నారు. అసమానతలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిపోషిస్తోందని షేక్‌షావలి ఆరోపించారు. కవులు, కళాకారుల పేరున కోటి రూపాయల నగదు పురస్కారాలు అందుకున్న వారైనా.. ఉద్యమకారుల గురించి మాట్లాడాకపోవడం వారి నైతికతకు నిదర్శనమన్నారు. ఉద్యమకారులు సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని షావలి పిలుపునిచ్చారు.

దస్‌పల్లా హోటల్‌లో నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న కంటెస్టెంట్స్

7,8 తేదీల్లో మిస్‌యూనివర్స్ తెలంగాణ పోటీలు

బంజారాహిల్స్, జూన్ 3: ఈనెల 7, 8 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న మిస్ యూనివర్స్ తెలంగాణ, మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ పోటీలకు సంబంధించిన సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో 'సాష్' పేరుతో ఫ్యాషన్ షో నిర్వహించారు. ర్యాంప్ వాక్‌లో యువతులు అదరగొట్టారు. జూన్ 7న దారా కన్వెన్షన్ హాల్‌లో మిస్ యూనివర్స్ తెలంగాణ ఫైనల్స్, 8న మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి 15మంది చొప్పున యువతులు ఫైనల్స్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ ఆంటోనీ గుంజాల్వెస్, ప్రసాద్ గారపాటి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో క్షయ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

100 రోజులపాటు సాగనున్న టీబీ విముక్త్ భారత్ అభియాన్

సిటీబ్యూరో, జూన్3, (నమస్తే తెలంగాణ): టీబీ విముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని 91 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 168 బస్తీ దావఖానలు, రంగారెడ్డి జిల్లాలోని 150 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో, మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 70 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. వందరోజుల పాటు నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్ఎంలు, మెడికల్ అధికారులు క్షేత్రస్థాయిలో పాల్కొని స్క్రీనింగ్ చేస్తారు. క్షయ నివారణకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వైద్యాధికారులు ప్రణాళికలు రూపొందించారు. గతేడాది క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు, మందులు అందించడంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల్లోకెల్లా రంగారెడ్డి రెండోస్థానం, మేడ్చల్ ఆరోస్థానం, హైదరాబాద్ తొమ్మిదో స్థానంలో నిలిచాయి. 2024 ఏడాదికి గాను హైదరాబాద్ జిల్లాలో 18,000 మంది క్షయవ్యాధిగ్రస్తులుండగా, రంగారెడ్డిలో 5,500 మంది, మేడ్చల్ జిల్లాలో 4,951 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యసేవలందించారు. వ్యాధిగ్రస్తులు ప్రత్యేక డ్రైవ్‌లో పరీక్షలు చేయించుకోవాలని వైద్యశాఖ అధికారులు కోరారు.

ఎమ్మెల్యే హరీష్‌రావు ఫ్లెక్సీల తొలగింపు

బంజారాహిల్స్, జూన్ 3: మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌తో పాటు పార్టీ నేతలు, అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించడం వివాదాన్ని రాజేసింది. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతో పాటు మంగళవారం ఎమ్మెల్యే హరీష్‌రావు జన్మదినం కావడంతో పెద్ద ఎత్తున అభిమానులు తెలంగాణ భవన్ చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా మంగళవారం ఉదయాన్నే జీహెచ్ఎంసీ సిబ్బంది తెలంగాణ భవన్ వద్దకు చేరుకుని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను వారం రోజులు గడిచినా తొలగించని జీహెచ్ఎంసీ సిబ్బంది ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీలను పుట్టిన రోజు నాడే తొలగించడం సిగ్గుచేటు అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. ఇదిలా ఉండగా బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే హరీష్‌రావు ఫ్లెక్సీలను తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది పక్కనే ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ బయట రోడ్డు మీద ఏర్పాటు చేసిన మహానాడు ఫ్లెక్సీ తొలగించకపోవడం గమనార్హం. మహానాడు పూర్తయి ఆరు రోజులు గడిచినా టీడీపీ నేతల ఫ్లెక్సీల జోలికి వెళ్లని ప్రభుత్వం ఓర్వలేని తనంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు ఫ్లెక్సీలు తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): వాడివేడి చర్చకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సిద్ధమైంది. మంగళవారం జరగనున్న సమావేశంలో అధ్వాన్నంగా మారిన రోడ్లు, పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్, అకౌంట్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు, ఎస్టేట్ విభాగాల వంటి తదితర 22 ప్రశ్నలపై హాట్‌హాట్‌గా చర్చ జరగనుంది. 17 నెలల కాలంగా పేరుకుపోయిన సమస్యలపై అధికార పార్టీని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ దవాఖానాల్లో వైద్యుల నిర్లక్ష్యంతో అమాయకులు చనిపోతుండటం, ఫతేనగర్ బ్రిడ్జి పెచ్చులూడి ఇద్దరు గాయపడటం, శానిటేషన్, వీధి లైట్ల నిర్వహణ, నాలా సమస్యలపై గళం ఎత్తనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు సమాచారం.

13 మంది ఉద్యోగులు పదవీ విరమణ

జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 13 మంది ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ పొందారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, జూన్ 3, (నమస్తే తెలంగాణ):

బయోమెడికల్ వ్యర్థాల ఛార్జీలు తగ్గించాలి

ఏఐడీఎస్ఏ

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని చిన్న, మధ్యస్థాయి డెంటల్ క్లినిక్స్‌పై విధించబడుతున్న అధిక బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ఛార్జీలను తగ్గించాలని అఖిల భారత దంత విద్యార్థులు, శస్త్ర చికిత్స నిపుణుల సంఘం (ఏఐడీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ సంఘం నేతలు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఏ సంఘం అధ్యక్షుడు డా. ఎండీ మంజూర్ అహ్మద్ మాట్లాడుతూ.. డెంటల్ క్లినిక్స్ తక్కువ మొత్తంలో బయోమెడికల్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తూ ఉన్నప్పటికీ, ఆసుపత్రులు, పెద్ద వైద్య సంస్థల తరహాలోనే అధిక ఛార్జీలు చెల్లించాల్సి వస్తోందని, దీంతో ప్రత్యేకించి ఒక చెయిర్ లేదా రెండు చెయిర్లతో నడుస్తున్న చిన్న డెంటల్ క్లినిక్స్ ఆర్థికంగా ఒత్తిడికి లోనవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సామర్థ్యం రీత్యా బయోమెడికల్ వ్యర్థాల ఛార్జీలను నిర్వహించాలని వారు కోరారు.

వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వర్సిటీ అధికారులు

జ్ఞానం సమాజానికి ఉపయోగపడాలి

జేఎన్టీయూహెచ్ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3: జ్ఞానార్జనతో పాటు దానిని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించడమే నిజమైన విద్య అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం నగరంలోని జేఎన్టీయూహెచ్ 13వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న తరుణంలో విద్యార్థులు సృజనాత్మకత, నైతికత, మానవీయ విలువలతో ముందుకు సాగాలని సూచించారు. శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు, సమాజ సేవలో జేఎన్టీయూ వర్సిటీ అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా వర్సిటీ రూ.498 కోట్ల పరిశోధన నిధులను పొందడం జరిగిందని, అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరించడంతో 25 దేశాల నుంచి 237 మంది విదేశీ విద్యార్థులు జేఎన్టీయూహెచ్‌లో చదవడం విశ్వవిద్యాలయ వైవిధ్యాన్ని గ్లోబల్ గుర్తింపును చాటుతోందని వివరించారు. అనంతరం 2023-24 సంవత్సరానికి గా